# ర్యాంకర్

**నా పేరు మేఘనాధ్. నేను పదవ తరగతిలో స్టేట్ ఫస్ట్ ర్యాంకర్‌ని. అందులో ఆశ్చర్యమేమీ లేదు. ఎందుకంటే ర్యాంక్ నాకు రాకుంటే మరెవరికి వస్తుంది? నేను చిన్నప్పట్నుంచి బాల మేధావిని.**

తెలివి, ప్రతిభ నాకు సహజలక్షణాలు. పైగా యివన్నీ నాకు వంశపారంపర్యంగా సంక్రమించాయి. అందుకే మా నాన్న టీ.వీ. ఛానల్‌వాళ్ళకిచ్చిన ఇంటర్వ్యూలో "నా కొడుకు మేఘనాధ్‌కి స్టేట్ ర్యాంక్ రావడానికి కారణం వాడు నా కొడుకుగా పుట్టడమే" అని చెప్పాడు. ఇక నేనైతే "మా నాన్నగారి వారసత్వమే కాకుండా, నేను రోజుకి పదునెనిమిది గంటలు చదవటం కూడా ఒక కారణమని" చెప్పాను.

ఇక మా అమ్మయితే అమాయకురాలు కాబట్టి "దేవుడి ఆశీస్సులు, ఉపాధ్యాయుల కృషి" అంటూ ఏవో కారణాలు చెప్పింది. మా పాఠశాల యాజమాన్యమైతే వాళ్ళు గొప్పలు చెప్పుకోవడానికి "మా సిస్టమ్, డిసిప్లిన్, చెత్త, చెదారం" అంటూ చెప్పారు.

❋ ❋ ❋

నాకు ర్యాంక్ వచ్చిన తరువాత నేను మా పాఠశాలకి వెళ్ళాను. వాళ్ళు రెడ్ కార్పెట్‌తో నాకు స్వాగతం పలికారు. ఉపాధ్యాయులందరూ లేచి క్లాప్స్ కొట్టి మరీ నన్ను గౌరవించారు. మా జూనియర్స్ నా మీద పూల వర్షం కురిపించారు. నేను స్టేజిమీదకెక్కి కాలు మీద కాలు వేసుకొని దర్జాగా కూర్చున్నాను.


ఆగస్టు పదిహేనో తేదీన, స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మళ్ళీ నేను మా పాఠశాలకి వెళ్ళాను. మా పాఠశాల యాజమాన్యం నన్నే ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. నా చేతే ఆ రోజు జాతీయ జెండా ఆవిష్కరణ చేయించారు.

ఉపాధ్యాయుడు గొప్పవాడా? విద్యార్థి గొప్పవాడా? అన్న ప్రశ్నే గనక వస్తే, విద్యార్థే గొప్పవాడంటాం, నేనూ మా నాన్న. ఎందుకంటే ఒక సబ్జక్టులో పరిపూర్ణత సాధించడమే గొప్ప ఉపాధ్యాయుడు. మరి విద్యార్థి ఆరు సబ్జక్టులలో పూర్తి అవగాహన కలిగి వుండాలి. అందుకనే ఉపాధ్యాయుడికంటే విద్యార్థే హండ్రెడ్ పర్సెంట్ గొప్ప అన్నది మా వాదన.

## కె. వేణుగోపాల్

అసలు ఉపాధ్యాయులు ఏమిచేస్తారు? మహా అయితే మాకు పాఠాలు చెబుతారు. కష్టపడి వినేది మేము. పెద్ద, పెద్ద నోట్సులిస్తారు. కష్టపడి చదివేది మేము. ప్రశ్నా పత్రాలు రాస్తారు. వాటికి జవాబులు రాసేది మేము. మేము కట్టే పాఠశాల ఫీజు ద్వారా యాజమాన్యం దగ్గర జీతాలు తీసుకుని వారికి బానిసలు లాగా పనిచేసే ఈ ఉపాధ్యాయులంటే నాకు పరమ అసహ్యం.

నేను యిలా నిజాలు మాట్లాడితే మా అమ్మ ఒప్పుకోదు. "తల్లి బిడ్డకు జన్మనిస్తుంది. కానీ నిజమైన ఉపాధ్యాయుడు ఆ బిడ్డకు వ్యక్తిత్వమనే మరో జన్మనిస్తాడు. జీవితాన్నిస్తాడు. జీవితాంతం నీడలా ఉండి ధైర్యాన్నిస్తాడు. ఈ లోకంలో నిజమైన నిస్వార్థపరుడు ఎవరంటే? ఒక ఉపాధ్యాయుడు మాత్రమేనని సమాధానం వస్తుంది" అంటూ చెబుతుంది.




అయితే ఈ మధ్య మా పాఠశాల ఉపాధ్యాయులకి భలే సన్మానం జరిగింది. స్టేట్ ర్యాంక్ వచ్చినందుకు నాకు సన్మానసభ ఏర్పాటు చేశారు. మేగా స్టార్ అమరజీవిని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమం అంతా సాయిబాబా కళ్యాణమండపంలో జరిగింది. అమరజీవి ప్రముఖ సినిమా స్టార్ కనుక జనం ఎక్కువగా వచ్చారు. కళ్యాణ మండపం నిండిపోయింది. మా ఉపాధ్యాయులకి కూర్చోవడానికి కాదు కదా, పాపం నిల్చోవడానికి కూడా చోటు లేదు. ఇది గమనించిన మా అకడమిక్ డైరెక్టర్ వారినందరినీ కళ్యాణమండపం ముందు నిల్చోమని సలహా యిచ్చాడు. ఇక వాళ్ళు పాపం ఉసూరుమంటూ మండపం గేటు దగ్గర కుక్కల్లా కాపలాగాస్తూ ఉండిపోయారు.

కరెక్టుగా సన్మానం జరిగే సమయానికి మండపం ముందు పెద్ద ఎత్తున టపాకాయలు కాల్పించారు మా వారు. ఆ శబ్దాలకి అందరి చెవులు చిల్లులు పడిపోయాయి. ఆ సమయంలో మా ఉపాధ్యాయుడికి ఒకరికి ఒళ్ళంతా కాలిపోయింది. ఒక స్కూటర్, రెండు సైకిళ్ళు కూడా కాలిపోయాయి.

ఈ విషయం తెలిసి మా అమ్మ కోప్పడింది. "అన్నదాత రైతుల కడుపులు కాల్చే ప్రభుత్వాలు, విద్యాదాత ఉపాధ్యాయుడి ఉసురు పోసుకొనే విద్యాదళారులు ఎప్పటికీ బాగుపడరు" అంటూ శాపనార్థాలు పెట్టింది.

❋ ❋ ❋

మా నాన్న నన్ను మరో ప్రయివేటు కాలేజీలో ఒక పైసా కూడా ఫీజు లేకుండా చేర్పించారు. పైపెచ్చు వాళ్ళే నాకు స్కాలర్‌షిప్స్ కూడా యిచ్చారు. ఆ సంవత్సరం నా ర్యాంక్ కారణంగా మా నాన్నకి బహుమతులు, సన్మానాల రూపేణా ఒకటిన్నర లక్ష వరకు ఆదాయం వచ్చింది. ఇక నేను చదివిన మా పాఠశాలవారికైతే ఓ కోటి రూపాయల వరకు 'విద్యావ్యాపారం' జరిగింది.

నేను రోజూ కాలేజీకెళ్తున్నాను. క్లాసులో

ముందు వరుస బెంచీలోనే కూర్చుంటున్నాను. పాఠాలు వింటున్నాను. రకరకాల ప్రశ్నలతో లెక్చరర్స్‌ని తికమకపెడుతున్నాను.

నాకీమధ్య లెక్చరర్స్ చెప్పే పాఠాలు వినబుద్ధికావట్లేదు. ఎందుకంటే వాళ్ళెవరికీ నాలాగా పదవతరగతిలో ర్యాంక్ రాలేదు కాబట్టి. అసలు ఉపాధ్యాయుల్నే కాదు. బంధువుల్నిగానీ, స్నేహితుల్నిగానీ ఎవరినీ గౌరవించాలనిగానీ, మాట్లాడాలనిగానీ అనిపించట్లేదు. ఎందుకంటే, వాళ్ళంతా నాలాగా ర్యాంకర్స్ కాదు కాబట్టి. లెక్చరర్స్ వచ్చినప్పుడు లేవాలనిగానీ, విష్ చెయ్యాలనిగానీ అనిపించడం లేదు.



ఒకరోజు లీజర్ పీరియడ్‌లో బోర్డ్ మీద ఇలా రాశాను –

"విద్యార్థి బ్రహ్మ! విద్యార్థి విష్ణు! విద్యార్థి దేవో మహేశ్వరః!

విద్యార్థి సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ విద్యార్థే నమః!" అది చూసిన మా తెలుగు లెక్చరర్ కోపంతో యింత ఎత్తు లేచాడు. "గురు శబ్దం ఎంతటి గురుతర బాధ్యత గలదో పిల్లకుంక నీకేం తెలుసు? నిన్ను అజ్ఞానాంధకారం నుండి మళ్ళించి, విజ్ఞానపు వెలుగుల్ని ప్రసాదించేవాడు, నీకు మార్గదర్శకుడు అయినటువంటి గురువునే గేలి చేస్తున్నావు. అది మంచిది కాదు. కన్న తల్లిదండ్రుల్ని, జన్మ భూమిని, మాతృభాషను, ఉపాధ్యాయుడ్ని అవమానించినవారికి పుట్టగతులుండవు.

మీరందరూ రోజూ మీ ముఖాల్ని అద్దాల ముందు చూసుకొని, మీ ముఖ సౌందర్యానికి రూపురేఖలు దిద్దుకొని వస్తారు. కానీ, మేము ఉదయం నిద్రలేచి విద్యాలయానికి వచ్చి, మీ ముఖాల్లో మా ప్రతిబింబాల్ని, మా ఆశయాల్ని వెతుక్కుంటాంరా!" అంటూ తిట్టారు.



✻ ✻ ✻

మొదటి సంవత్సరం ఇంటర్ పరీక్షలు పూర్తి అయ్యాయి. ఫలితాలు వచ్చాయి. కానీ నాకు స్టేట్ ఫస్ట్ రాలేదు. కేవలం కాలేజీ ఫస్ట్ మాత్రమే వచ్చింది. స్టేట్

ఫస్ట్ టాపర్స్‌లో నేను వందోవాడిని కూడా కాను. నాకు చాలా బాధనిపించింది. నా పరీక్ష పేపర్లు కరెక్షన్ చేసిన లెక్చరర్స్‌కి సరిగా అవగాహన లేదేమో అనిపించింది. నా ప్రతిభను, తెలివిని వారు అంచనా వెయ్యడంలో ఫెయిలయ్యారేమో అనిపించి, మా నాన్నగారు కూడా నా మాటల్తోనే ఏకీభవించారు.

* * *

ఇంటర్ ఫైనల్‌ఇయర్‌లో నేను కాలేజీకి పోవడమే మానేశాను. ఇంట్లోనే కూర్చుని చదవడం ప్రారంభించాను. నేనే నోట్స్ రాసుకున్నాను. నేనే ఇంపార్టెంట్స్ నిర్ణయించుకున్నాను. కష్టపడి చదివాను. రోజుకి పదునెనిమిది కాదు కదా, ఇరువై గంటలు చదివాను. ఈసారి ఇంటర్ ఫైనల్ పరీక్షల్లో నాకే స్టేట్ ర్యాంక్ వస్తుందని ముందుగా చెప్పాలనుకున్నాను. అందుకు మా నాన్న సంతోషించి నాకు సహకరించారు.

ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియావాళ్ళని మా యింటికి పిలిపించాం.వాళ్ళందరి ముందు "ఈ సారి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ నాకే వస్తుందని" ప్రకటించాను. మా నాన్న కూడా "నా కొడుకు మీదున్న నమ్మకంతో యిలా ముందుగానే మీడియాకు తెలుపుతున్నామని" వివరించాడు.

మా అమ్మయితే "మీ తండ్రీ కొడుకుల వితండవాదం, విర్రవీగడం చూస్తుంటే నాకేదో కీడు శంకిస్తోంది. ఈ యింటికి ఏమి ఉపద్రవం రాబోతోందో" అని బాధ పడింది.

* * *

ఆ మరుసటి రోజే రిజల్ట్స్ వచ్చాయి. నేను ఫెయిలయ్యాను. నాకు తల తిరుగుతోంది. నరాలన్నీ చిట్లిపోతున్నట్లుంది. జుట్టు పీక్కుంటున్నాను. గట్టిగా చాలా బిగ్గరగా అరవాలని వుంది. ఎక్కడికైనా దూరంగా పరుగెత్తి పారిపోవాలని వుంది. నేనిలా బాధపడుతుండగానే మా నాన్న ఉన్నట్టుండి కళ్ళు తిరిగి కింద పడ్డారు. మా అమ్మ అరుస్తూ ఆయన దగ్గరికి పరుగున వెళ్ళింది. జనాలందరూ మా చుట్టు పక్కలవాళ్ళు గుమికూడారు. నాకంతా అయోమయంగా వుంది.

ఇంతలో అంబులెన్స్ వచ్చింది. మా నాన్నని తీసుకెళ్ళింది. నేను అలాగే కూర్చున్నాను. మళ్ళీ కొంత సమయానికి అంబులెన్స్ వచ్చింది. అందులో నుండి మా నాన్నని దించుతున్నారు. మా అమ్మ పిచ్చిదానిలా ఊగిపోతూ భోరుభోరున ఏడుస్తూ వచ్చి నన్ను పట్టుకుంది.

అప్పుడర్థమయ్యింది నాకు మా నాన్న "చనిపోయాడ"ని.

* * *

ర్యాంకుల పేరుతో ఈ కార్పొరేట్ విద్యా వ్యాపార సంస్థలు విద్యార్థులమైన మమ్మల్ని జెరాక్స్ మిషన్స్‌గా మారుస్తున్నాయి. మక్కీకి మక్కీకి సమాధానాల్ని బైహేడ్ చేసి పేజీలకి పేజీలు పరీక్షలు రాయిస్తున్నాయి. సొంతంగా సమాధానాలు రాసే సృజనాత్మకత మాలో మచ్చుకైనా లేదు. మా మెదడుని పెంచుతున్నాయి. మా హృదయాల్ని కుంచించుకుపోయేటట్టు చేస్తున్నాయి. మేమిలాగే ముందుకెళితే అతి తెలివిపరులుగా మిగిలిపోతామేగానీ మానవతావాదులం కాలేం. చదువంటే అన్ని సబ్జక్టుల్లో రాత్రింబవళ్ళు కష్టపడి బట్టీపట్టి ర్యాంక్ తెచ్చుకోవడం కాదు. "ప్రేమ, త్యాగం, సెంటిమెంట్స్, నైతిక విలువలు, వీటన్నింటితో కూడిన వ్యక్తిత్వం" నేర్పాలి. అనే నిజం నాకిప్పుడే అర్థమవుతోంది. అశాస్త్రీయమైన, అనారోగ్యకరమైన ఈ పద్ధతిమారాలి. అందుకు గాను నా వంతు నేను చెయ్యాలి.

## తెలుగు



**ఇద్దరు తమిళులు**
**కలుసుకుంటే**
**తమిళంలో**
**సంభాషణ!**
**ఇద్దరు బెంగాలీ బాబులు**
**కల్సుకుంటే**
**బెంగాలీలో మాటలు!**
**ఇద్దరు తెలుగువాళ్ళు**
**కలిస్తే**
**ఇంగ్లీషులో పూసులు!**
**ఈ వ్యవస్థ మారాలి**
**మన తెలుగు బావుటా**
**ఎగరాలి! ఎగరాలి!!**

* * *

**చప్పట్లు**
**అనంతరం**
**నాయకుడు**
**"హౌ ఈజ్ మై భాషణ్??"**

**-గుడిమెట్ల గోపాలకృష్ణ**

* * *

నన్నిప్పుడు ఒక రూములో బంధించారు. రోజూ చాలామంది వచ్చి నన్ను విచిత్రంగా చూసి పోతున్నారు. కిటికీలో నుంచే నాకు అమ్మ రోజూ ఏడుస్తూ అన్నం తినిపిస్తోంది.

ఒక రోజు అమ్మని 'ఏమారించి' రూము చెరలో నుంచి తప్పించుకొని పారిపోయాను. పారిపోతూనే వున్నాను. కానీ నాకు నేను చేరాల్సిన గమ్యం తెలుసు. అందుకే సందులు, గొందులు తిరిగి, ఎలాగో ఒకలాగా నా గమ్యం చేరాను. అంటే నేను పదవ తరగతి చదివిన పాఠశాలన్నమాట. వాచ్‌మేన్ ఎదిరించి లోపలికి దూరాను. అక్కడ ఏమేమి చేశానో నాకు సరిగ్గా గుర్తు లేదు.

* * *

నన్ను ఒక వ్యానులో తీసుకెళ్తున్నారు. నలుగురు వ్యక్తులు, తెల్ల బట్టలు ధరించినవారు నన్ను గట్టిగా పట్టుకున్నారు. వ్యానులో నుంచి ఒక రూములోకి తీసుకెళ్ళారు. ఒక కుర్చీలో గట్టిగా కట్టేశారు. నా కుర్చీకి ఏవేవో వైర్లు ఉన్నాయి.

ఇంతలో ఒకాయన వచ్చి "పాఠశాలలోకి దూరి గొడవ చేశాడంట. అక్కడున్న షోకేస్ అద్దాలు, నోటీసు బోర్డ్‌లోని ఫోటోలు పగలగొట్టి పాడుచేశాడంట. పెద్ద, చిన్న చూడకుండా అక్కడున్నవారిపై రాళ్ళతో, చెప్పులతో దాడిచేశాడంట.

చంపేస్తాను, నరికేస్తాను అంటూ నానా గొడవ చేశాడంట. వాళ్ళు పాపం భయంతో వణికిపోతున్నారు. ఇవ్వండి కరెంట్ షాక్ పిచ్చి నా కొడుక్కి అంటున్నాడొకాయన.

కనెక్షన్ ఇచ్చారు. అమ్మా అంటూ గావుకేక వేశాను. కాదు, కాదు 'చావు కేక' వేశాను. కళ్ళల్లో ఏవో మెరుపులు కనిపించాయి. చెవుల్లో విపరీతమైన శబ్దాలు వినిపించాయి. ఒళ్ళంతా ఏదో ప్రాకినట్లయింది. రక్తం గడ్డ కట్టుకుపోతోంది. మంట, నొప్పి, బాధ. ఇంకా యింకా ఎక్కువవుతోంది. నాకు ఏమో అయిపోతోంది. ఇంతలో ఒకడు నా నోట్లో ఏదో దూర్చాడు. అరవడానికి కూడా లేదు. కానీ అరవాలని వుంది. ఒక్కటి మాత్రం గట్టిగా అరిచి చెప్పాలని వుంది.

"ఓ విద్యార్థుల తల్లిదండ్రులారా! పరీక్షల పోటీ ప్రపంచంలో పిల్లలు నెగ్గుకు రావాలనే నెపంతో, తపనతో మమ్మల్ని తీసుకెళ్ళి విద్యా వ్యాపారం చేసే కార్పొరేట్ సంస్థలకి అప్పజెప్పకండి. మీ ఆశయాలకి, వారి స్వార్థానికి మా బంగారు భవిష్యత్తుని బలి చేయకండి" అని. *